# అతడూ — ఆమె

ఆమె: (కూర తరుగుతూ) ఆరంభించా —

అతడు: (మౌనం)

ఆమె: ఏముంది - తెల్లవారటం తరువాయి. ఆ పడకకుర్చీ, ఆ దిక్కుమాలిన పత్రికా వుంటే చాలు. ఇంట్లో మంచి చెడ్డా యేమీ అక్కర్లేదు. రామరామ! ఈ మాయదారి పత్రిక ఎక్కడ పోగయిందో గాని, పొద్దస్తమానం దాని సేవతో సరిపోతోంది.

అతడు: (విసుగుతో చదివే పత్రికను కింద వేస్తాడు)

ఆమె: (పత్రికను తీసుకొని) దీన్లో ఏముందండి మహా చదువుతారు! ఇదేమైనా రామాయణమా, భారతమా? అబ్బెబ్బె...

అతడు: (నవ్వుతూ) పిచ్చిదానా...

ఆమె: (మూతి ముడుచుకొని) నేనెలాగో పిచ్చిదాన్నే లెండి. ఇవ్వాళ్ళ మీరు నాకేమీ కొత్తగా నామకరణం చెయ్యక్కర్లేదు.

అతడు: నీ మొహం - యీ కాలంలో పత్రిక చదవకపోతే లోకజ్ఞానం కలగదు. ఈ విశాల ప్రపంచంలో జరిగే విషయాలన్నీ మనకు పత్రికల మూలంగా తెలుస్తాయి.

శ్రీ చల్లా రాధాకృష్ణశర్మ

ఆమె: ఇంకేం - పొద్దస్తమానం పత్రికల్నే తిరగేస్తూ వుండండి. అమ్మాయి పెళ్లి తొందర్లోనే అవుతుంది.

అతడు: (చదవటం ఆపి) మళ్లా సాగించావూ - నీ పాట నీదే గాని నేను మాత్రం వూరికే వుంటున్నానా చెప్పు?

ఆమె: మీ పత్రిక లేమిటో మీరేమిటో - అంతేగాని యీడు వచ్చిన పిల్ల యింట్లో వుందిగదా దానికి పెళ్ళి పేరంటాలు జరుపుదామని మీరనుకుంటేగదా! ఎంత తల పగులగొట్టుకున్నా నా మాటలు మీకు రుచిస్తాయీ - మీకు లేనప్పుడు నాకుమాత్రం ఎందుకులెండి యీ విషయం.

అతడు: నీ మొహం - నేను పడే శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరవుతోంది. లేకుంటే యీపాటికి మనమళ్లతో ముద్దాడుతూ వుండవలసిన వాళ్ళంకదూ.

ఆమె: అయ్యో అన్నారు. ఈ జన్మలో ఆ గీత లేదులెండి. మా చెల్లెలు మనమరాల్ని ఎత్తుకొని ముద్దాడుతూ వుంటుంటే నేనింకా అల్లుడికోసం ఎదురుచూస్తూ వున్నాను. అంతమాత్రం అదృష్టమే వుంటే యీ వేళకు అన్నీ సక్రమంగానే జరిగి వుండేవి.

అతడు: పిచ్చిదానా - అల్లుడంటూ ఒకడు రావాలి గాని ఆ ముచ్చటలన్నీ ఎంతసేపూ...

ఆమె: ఆ - తీరకేం - అమ్మాయి పెద్దమనిషై రెండేళ్ళయింది. మూడో యేడు కూడ మొన్న పౌర్ణమికి వచ్చింది. ఈడు వచ్చిన పిల్లను ఇంట్లో పెట్టుకోవటం రొమ్ముల కుంపటేగదా - అదీ గాకుండా నలుగుర్లోను తలెత్తుకొని తిరుగుతూ వున్నందుకు మనల్ని నలుగురూ నానా మాటలూ అంటున్నారు.

అతడు: అయితే నన్నేం చెయ్యమంటావ్?

ఆమె: మాట్లాడితే యిదొక పాట నేర్చారు - బాగానే వుంది. తడవతడవకు ఏం చెయ్యమంటావు, ఏం చెయ్యమంటావని అడుగుతూ వుండండి...పుణ్యకాలం కూడా దాటిపోతుంది.

అతడు: అబ్బా - వేధించుకు తినకు - నీ సలహా ఏమిటో, చెప్పు -

ఆమె: నా సలహా మీకు పనికివస్తుందీ- మీరు చేసే ప్రతి పనికీ నన్నే సలహా అడుగుతున్నారు కాబోలు. ఏదో మీ చిత్తం వచ్చినట్టు చేసుకోండి. మధ్య నేనెందుకు పానకంలో పుడక మాదిరి.

అతడు: పోనీ యిప్పుడడుగుతున్నాగా చెప్పు.


ఆమె: నాకేమీ తెలీదండి. మీ ఇష్టం మీ అమ్మాయి యిష్టం. మీరంతా చదువుకున్నవాళ్ళు. తెలివిగలవాళ్ళు. నేను పట్టి పిచ్చిబొందను...

---

ఆ డాక్టరుగారి దగ్గరకు డబ్బువున్న రోగులే ఎక్కువ మంది వెళ్లుతూ వుంటారు. లావు తగ్గించటానికి ఆయన ఏదో గొప్ప చిటకా కనిపెట్టాడని పేరు పాకిపోయింది. ప్రతి రోజూ ఆయన గుమ్మంలో పలుకాయులు, అతికాయులు, మహాకాయులు గుమికూడుతూ వుండేవారు.

కొంతకాల మిలా జరగాక ఒకాయన యీ చిటకా ఏదో తెలుసుకోవాలన్న సరదా కొద్దీ డాక్టరుగారితో చనువు చేసుకొని "లావు తగ్గించటానికి మీరే మందు వాడుతున్నారో చెప్ప" మని అడిగాడు.

"ఆ మందూ లేదు: మాకూ లేదు. ఒళ్లు బలిసినవాళ్లు ఎవరైనా నాదగ్గిరకు వస్తే, నేను వాళ్ళతో మొట్టమొదటిరోజు ఏమీ మాట్లాడకుండా తూకం అదీ తూచీ, యిక ఆ రోజు మొదలుకొని రెండు వారాల వరకు వాళ్లు ఏ నిమిషాన ఏవేవి తింటారో అదంతా జాబితా వ్రాసుకు పట్టుకు రమ్మంటాను. వాళ్లు ఆ రెండు వారాల గడువూ తీరాక, ఆ జాబితా పట్టుకు తయారు అవుతారు. అప్పటికే ఏనుగుల్లాంటి ఆ మనుషులు పీనుగులై వస్తారు!" అన్నాడు ఆ డాక్టరు గారు చిరునవ్వులు ఒలకబోస్తూ.



అతడు: (నవ్వుతూ) దండకం పూర్తయిందా?

ఆమె: అది కాదండీ - ఈడు వచ్చిన తర్వాతకూడ అమ్మాయికి చదువు లెందుకు చెప్పండి. అవ్వేమైనా వుద్ధరిస్తాయా పెడతాయా?

అతడు: (నవ్వుతూ) ఈ కాలంలో ఆడదైనా సరే మగవాడైనా సరే చదువుకొని తీరాలి. లేకపోతే ఏమీ లాభం లేదు.

ఆమె: అయితే మీరు కూడా చదువుకున్న దాన్ని చూసి పెళ్ళి చేసుకుంటే బాగుండేదిగదా!

అతడు: మన కాలం, మన పద్ధతులు పూర్తిగా మరిపోయాయి. ఇప్పుడంతా కొత్తరకం. రోజురోజుకీ కాలం మారుతూ వుంటుంది. దాంతోపాటు మనం కూడ మారుతూవుండాలి. అసలు మార్పు అనేది..

ఆమె: చాల్లెద్దురు మీ వుపన్యాసం, మీరూను.

అతడు: ఇంతకూ అమ్మాయిని చదివించడం నీకు సుతరాం యిష్టం లేదన్నమాట?

ఆమె: నా యిష్టా యిష్టాలతోనే మీరు ప్రతీ పనీ చేస్తున్నట్టు. ఎంత చక్కగా మాట్లాడుతారండీ.

అతడు: ఈ మాటలకేంగాని - మన రాఘవయ్యగారి రెండోకొడుకు బి. ఏ. చదువుతున్నాట్ట...

ఆమె: (విసుగుతో) నాకేమీ తెలీదండి.

అతడు: కూర తరగటం మాత్రం తెలుసు. ఇంకేమీ తెలీదు...

ఆమె: (గొంతు మార్చుకొని) నా పనిని నేను చేసుకున్నా మీకు కష్టమే—

అతడు: అదికాదే - యీ సంబంధం చూడు...

ఆమె: సంబంధాలతో నాకేమీ సంబంధం లేదండి.

అతడు: (విసుగుతో) నా మాట వినవే నీకు పుణ్యం వస్తుంది. రాఘవయ్యగారి రెండోకొడుకు...

ఆమె: నాకేమీ తెలీదండి. అంతా మీ యిష్టం, మీ అమ్మాయి యిష్టం.

అతడు: దాని యిష్టమేమిటే - మనమే మంచీచెడ్డా విచారించి మంచి సంబంధం ఖాయంచేస్తే అది పెళ్లిచేసుకుంటుంది.

ఆమె: ఈ పై పైమాటలకేం లెండి... ఇంతకూ మీవల్లనే బంగారంలాంటి పిల్ల చెడిపోయింది.

అతడు: ఇది మరీ బాగుంది. నేనేం చేశాను.?

ఆమె: మీరు చేసేవన్నీ బాగుండక వంక పెట్టేటట్టు వుంటాయా ఏమిటి? లేకపోతే ఆవిధంగా నిక్షేపం లాంటి ఆ వెంకయ్యగారి కొడుకుని అదీ మీరూ కలిసి నానామాటలూ అంటారూ...

అతడు: నేనేం చేశాను. ఆ అబ్బాయి పైన మన అమ్మాయికి యిష్టంలేదు. అందుకనే అది వద్దని గోలచేసింది.

ఆమె: పాపం! మీరేమి చెయ్యలేదు. పరాయివాళ్లకు లేనిపోని వంకలు పెట్టడం అమ్మాయికి ఘట్టుగా నేర్పారు. ఇది చాలదు కాబోలు.

అతడు: ఆ అబ్బాయి నల్లగా, లావుగా, పొట్టిగా వుండడంబట్టి అమ్మాయి...

ఆమె: చాల్లెద్దురు - మీరు చేసిన ఘన కార్యాన్ని రొమ్ము విరుచుకుని చెబుతున్నారు కూడాను. ఈవిధంగా అమ్మాయి దగ్గర పాటలుపాడి బంగారం వంటి ఆ అబ్బాయికి లేనిపోని వంక లెన్నో తెచ్చి పెట్టారు.

అతడు: అయినదానికీ, కానిదానికీ నన్నంటే లాభమేముంది చెప్పు?

ఆమె: అవునౌండి - యిట్లా చెప్పకోటంకూడా సిగ్గులేకే - ఆ అబ్బాయిని మీరు అవమానం చేసినంతమాత్రాన అతడికి పెళ్లి కాకపోదు. గంతకు తగినబొంత దొరక్కపోతుందీ—




11/1 Jai Narain ch. lane, Calcutta-9

# అతడు ఆమె

అతడు: అవమానం చేశానా? విచిత్రంగా వుంది నీధోరణి.

ఆమె: అవమానం కాదులెండి. నలుగుర్లోను నానా మాటలూ అన్నారు. ఇంతకన్నా యింకేం చెయ్యాలి? మీరూ, మీ అమ్మాయీ మహా అందంగా వున్నారు కాబోలు.

అతడు: (నవ్వుతూ) అందంగావున్నానని నేనేమీ టాం టాం వేసుకోటంలేదే..

ఆమె: ఎవరెట్లా వుంటే నాకెందుకులెండి... (కూరల బుట్టను తీసుకుని లేస్తూ) యీ మండిపోయిన పనిని చేసుకోలేక చచ్చిపోతున్నాను. (వెళ్ళబోతుంది)

అతడు: ఎక్కడికి?

ఆమె: (విసుగుతో) మీతో మాట్లాడుతూ కూర్చుంటే అక్కడ వండి వార్చేవాళ్ళెవరూ లేరు. కాలుపైన కాలువేసుకొని కూర్చున్నా మీకు జరుగుతుంది. నాకెట్లా జరుగుతుంది. అంతా నన్ను మండపెట్టేవాళ్ళేగా -

అతడు: ఏమిటీ మాటలు?

ఆమె: అంతేలెండి - నిజం నిష్ఠూరంగా వుంటుంది. ఆ అమ్మాయి మటుకు అది ఏమైనా పనిచేస్తుందా? దాని చదువేమో దాని స్నేహితులేమో - అంతే గాని అమ్మ కష్టపడుతోందిగదా కొంచెం సహాయం చేద్దామని అనుకుంటుంది... దాన్ని నేను పట్టుకొని వ్రాగులాడాల్సిందే కాని రవ్వంతైనా లాభంలేదు. ఎండలో నుంచుంటే నీడకు రమ్మని పిల్చేవాళ్ళెవరూ లేరు.

అతడు: (విసుగుతో) ఏమిటే యిదంతా—

ఆమె: ఏమిటా - నా ఖర్మ, ఏనాడో చేసుకున్న పాపం యీనాడు యిట్లా బద్దలవుతోంది. నా ఘటం యిట్లా వెళ్ళిపోవాల్సిందే...

అతడు: రోజూ వున్న యీ గొడవకేంగాని రాఘవయ్యగారి రెండో అబ్బాయి..

ఆమె: నాకేమీ తెలీదండి...

అతడు: నీకు తెలియదు కాబట్టే చెబుతున్నాను. రాఘవయ్యగారు మహా ఘరానా మనిషి. వాళ్ళది పాలవంటి వంశం. కుర్రాడు బి. ఏ. చదువుతున్నాడు. చాలా బుద్ధిమంతుడని నలుగురూ అనుకుంటుంటే విన్నాను.

ఆమె: నాకేమీ తెలీదండి. అంతా మీ యిష్టం, మీ అమ్మాయి యిష్టం. మధ్య నాదేముంది. నే నెవత్తెనో పరాయిదాన్ని.

అతడు: మళ్ళీ కథ మొదటికొచ్చిందీ- రామ రామ - నీ మాటలు విని విని చెవులు తడికెలు కట్టిపోయాయి.

[వీధిలోంచి 'మూర్తిగారూ' అనే పిలుపు వినబడుతుంది]

అతడు: ఆఁ - వస్తున్నా, వస్తున్నా... (వీధిలోకి వెళ్తున్నాడు)

ఆమె: ఏమండీ - మిమ్మల్నే... నేను గొంతు చించుకోవడమే కాని ఆయన సమాధానంకూడా యివ్వరు.

అతడు: (లోనికి వచ్చి) స్నేహితుడితో మాట్లాడుతూవుంటే ఎందుకట్లా బొబ్బలు పెడతావు?

ఆమె: మీతో మాట్లాడకూడదని ఎంత నోరు నొక్కుకున్నా మాట్లాడవలసి వస్తోందిగదా... నేను చేసుకున్న కర్మ...

[అతడు దుస్తులు వేసుకొని వీధిలోకి వెళ్తూవుంటాడు]

ఆమె: మిమ్మల్నే...

అతడు: మళ్ళీ ఏమిటి?

ఆమె: ఇందాకేదో అన్నారే—రాఘవయ్యగారికొడుకు విషయం...

అతడు: (నవ్వుతూ) నీకేమీ తెలీదుగా.

ఆమె: (నవ్వుతూ) సర్లెద్దురూ - ఆ విషయంగూర్చి గట్టిగా వాకబ్ చెయ్యండి! మంచి ముహూర్తాలుకూడ లేవట వచ్చే నెలలో.

అతడు: చిత్తం... (వీధిలోకి వెళ్లును.)

★

## కొండంత దేవుడు

జపానులో టోకియో నగరమునకు ఉత్తరదిశగా ఫూచూషిమా అనే జిల్లాలో ఒక పర్వతం ఉంది. ఆ పర్వతమునంతను ఒక్కటే శిలావిగ్రహముగా చెక్కుచున్నారు. ఇది బుద్ధదేవుని విగ్రహము. ఇటువంటి బుద్ధవిగ్రహమును జపానుభాషలో "దాయి బుట్సూ" అంటారు. "ధ్యానబుద్ధుడు" అని ఆ మాటకు అర్థము.

ఇటువంటి పర్వత ప్రతిమలు బుద్ధదేవుని ఆకారములో జపాను దేశమందు అనేక ప్రాంతాలలో చెక్కబడినవి. అట్టి విగ్రహములలోకెల్ల ఫూచూషిమాలో చెక్కబడిన "ధ్యానబుద్ధుడు" (దాయిబుట్సూ) అత్యంత బ్రహ్మాండమైనది. ఈ బుద్ధవిగ్రహముయొక్క శిరస్సుమాత్రమే సుమారు 11 గజముల ఎత్తుగలదై యున్నది. దానినిబట్టి నిలువబడిన పూర్ణాకారవిగ్రహము 88 గజముల యెత్తుగాని 99 గజముల ఎత్తుగాని ఉంటుంది. కాని సుఖాసీనుడై కూర్చున్న బుద్ధ విగ్రహము 44 గజముల ఎత్తు ఉంటుంది. ఒక్కటే కొండను ఇంతపెద్దవిగ్రహంగా చెక్కడమైనది. కనుక కొండంతదేవుడు జపానులో ఉన్నాడు.

అబలసుధ

స్త్రీల కుసుమ వ్యాధులు. అకాల బహిష్టు, ఋతుబద్ధము, ఋతుశూల, ఒడలునొప్పులు, తలనొప్పి, గుండెదడ. కాళ్ల లాగుట, మనస్తిమితము లేకపోవుట, నిద్రపట్టకుండుట, నడుమునొప్పులు, బలహీనత, మలబద్ధము, హిస్టీరియా మొ॥ హరించును

సీసా రు. 3/- వి. పి. అ. 0-14-0.

ఇండియన్ మెడికల్ హౌస్,
లక్ష్మి టాకీసు రోడ్డు - విజయవాడ-2.